# విశ్వ రహస్యం

**ఖ**గోళశాస్త్ర పరిశోధనల కోసం నిర్దేశించబడిన ఆ ప్రయోగశాల ప్రశాంతంగా ఉంది.

సమయం రాత్రి ఎనిమిది గంటలు.

అందరూ వెళ్లిపోయినా తన ఛాంబర్‌లో కూచుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త సుభాష్‌చంద్ర.

విశ్వరహస్యాల్ని ఛేదించాలన్న కోరిక అతనిలో యుక్తవయసు నుండే పుట్టి - బలంగా పెరిగింది.

పసితనంలో చందమామని చూపించి - అందులో అవ్వ రాట్నం వడుకుతూ ఉంటుందని అమ్మ చెప్పినప్పుడు సంబరపడి - వూహ తెలిశాక చంద్రుడు కూడా భూమి చుట్టూ తిరిగే ఓ గ్రహ శకలమని తెల్సుకున్నప్పుడు ఎంతటి ఆశ్చర్యమో . . .

తను నిలబడి ఉన్న భూమి . . . తన పాదాల కింద నిశ్చలంగా పర్చుకుని ఉన్న భూమి - గోళాకారంలో ఉంటుందనీ, అతి వేగంగా పడమర నుంచి  తూర్పు వైపునకు తన చుట్టూ తాను తిరుగుతూ ఉంటుందని సైన్సు మాస్టారు చెప్పినప్పుడు నమ్మకం కలగనంత ఆశ్చర్యం . . .

పగలూ రాత్రిని ప్రసాదించే సూర్యుడు ఆకాశంలో ప్రకాశించే వేల వేల నక్షత్రాల్లానే మనకు దగ్గరగా ఉన్న ఓ నక్షత్రమని తెల్సినపుడు విశ్వాంతరాళంలోని గ్రహ గోళాలు, నెబ్యులాలు, నక్షత్రాలు, గెలాక్సీల గురించి తెలుసుకోవాలన్న బలమైన కోరిక అతనిలో . . .

అదే ఉత్సుకత . . . పట్టుదలతో అతను ఆస్ట్రోఫిజిక్స్‌లో రీసెర్చి చేసి, రాష్ట్రంలోనే అత్యుత్తమ ఖగోళ పరిశోధనాలయంలో ఉద్యోగంలో చేరాడు.

టాలమీ, కోపర్నికస్, కెప్లర్ లాంటి శాస్త్రవేత్తల్ని ఆదర్శంగా తీసుకుని పరిశోధనల్ని కొనసాగించిన అతనికి నిరాశే మిగిలింది. అతను రిటైర్ కావడానికి రెండేళ్ళ వ్యవధి ఉంది. ఇన్నేళ్ళ పరిశోధనల్లో తమ సంస్థ సాధించింది అతి తక్కువనే చెప్పాలి.

గత కొన్నేళ్ళుగా అతని పరిశోధన విశ్వాంతరాళంలో జీవం ఉండే అవకాశాల అన్వేషణ వైపుకు మళ్ళింది.

సౌర కుటుంబంలో ఒక్క భూమి మీద తప్ప జీవరాసి మరెక్కడా లేదు. కానీ మన సూర్యుని పోలిన నక్షత్రాలు విశ్వంలో లెక్కకు మించినన్ని . . . ఏదో ఓ చోట అతి మేధావులైన జీవజాలం ఉండే ఉంటుందన్న నమ్మకం అతనిలో . . . మనిషి కన్నా మెరుగైన మేధోజీవులు ఎక్కడో, ఏ గెలాక్సీలోనో ఉండి ఉంటారని . . . ఎప్పటికైనా తనే దానికి సంబంధించిన ఆధారాలు సేకరిస్తాడనీ అతని ప్రగాఢమైన నమ్మకం. అంతటి గొప్ప విషయాన్ని కనుక్కోవటం ద్వారా మానవాళికి తన వంతు మహోపకారం చేయందే అతనికి మనశ్శాంతి దొరకదు.

అతను యింట్లో కూడా చిన్న ప్రయోగశాలని ఏర్పాటు చేసుకున్నాడు. అతని నిరంతర చింతన విశ్వాంతరాళంలో నిక్షిప్తమై ఉన్న నిగూఢ రహస్యాల్ని కనుక్కోవడం గురించే . . . తను ఎప్పటికైనా సాధిస్తాడు. చరిత్రలో గొప్ప శాస్త్రవేత్తగా నిలిచిపోతాడు.

సుభాష్‌చంద్ర దీర్ఘంగా నిట్టూర్చాడు. లేచి తన గదికి తాళం వేసి బైటికి నడిచాడు. గూర్ఖా చేస్తున్న శాల్యూట్ కూడా పట్టించుకోకుండా తన దీర్ఘమైన ఆలోచనల్లో మునిగి– డ్రైవర్ కారు డోర్ తీసి పట్టుకుంటే – నిశ్శబ్దంగా కార్లో కూచున్నాడు.

* * * * *

రుక్మిణమ్మ భర్త కోసం ఎదురుచూస్తూ కూచుంది. చూపు గుమ్మం వైపున్నా మనసు మాత్రం పోచమ్మ ఇంటి నుంచి వచ్చే కబురు కోసం ఆరాటపడ్తోంది. ఆలస్యమయ్యే కొద్దీ ఆమెకు గుబులు గుబులుగా ఉంది. కొద్దిగా భయమనిపించింది కూడా.

వాళ్లింట్లో వంట మనిషి పోచమ్మ. గత పదేళ్లుగా అదీ, దాని కూతురూ తమింటిని అంటిపెట్టుకునే ఉన్నారు. తనకూ, తన భర్తకూ ఏ ఇబ్బందీ కలక్కుండా చూస్కునే పోచమ్మంటే ఆవిడకు వల్లమాలిన అభిమానం.

ఆమె వారిస్తున్నా వినకుండా పదిహేనేళ్లకే పోచమ్మ తన కూతురికి పెళ్ళి చేసింది. సంవత్సరం తిరక్కుండానే అది పురిటికని యింటికొచ్చింది.

మధ్యాహ్నం తనకు భోజనం వడ్డించాక – రెండూ రెండున్నర మధ్య – దానికి కబురొచ్చింది పిల్లకు నొప్పులొస్తున్నాయని.

"మొదటి కాన్పు కదా – హాస్పిటల్‌కి పిల్చుకెళ్ళు" అంది రుక్మిణమ్మ.

"గా ముచ్చట మాకెందుకమ్మా – గరీబోల్లం. యింటి సంది నర్సమ్మొంది. గదే పురుడు పోస్తది".

రుక్మిణమ్మకు నవ్వొచ్చింది. పూర్వం రోజుల్లో మంత్రసానులుండేవారు. యిప్పుడు నర్సులే మంత్రసానులకు మల్లే యిళ్ళ దగ్గర పురుళ్ళు పోస్తున్నారేమో . . .

"మరి మాపటేలకి జరంత వంట సేస్కుంటావా" ఆమెని యిబ్బంది పెట్టటం ఇష్టం లేకున్నా ఈ ఒక్కపూటకి తప్పదన్నట్లు అడిగింది పోచమ్మ.

"పర్లేదులే . . . నువ్వు మొదట యింటికెళ్ళి పిల్లని చూస్కో" అందామె. పోచమ్మ చేతిలో మూడొందలు పెట్టి, "ఎందుకైనా అవసరం రావచ్చు ఉంచుకో. పురుడు రాగానే నాకు కబురు పంపించు. అది నా కళ్ళెదుట పెరిగిన పిల్ల . . . నేను ఎదురు చూస్తూంటాను. మర్చిపోకు" అంది.

అలా పోచమ్మ వెళ్ళినప్పటినుండీ పురిటి కబురు విందామని ఆతృతగా ఎదురు చూస్తూనే ఉంది. ఆమెకు అమెరికాలో ఉన్న తన కూతురు మొదటి పురుడప్పుడు చేసిన హడావిడి గుర్తొచ్చి – మాతృహృదయం మమతతో నిండిపోయింది.

పోచమ్మ కూతురైనా, తన కూతురైనా ఆడపిల్ల ఆడపిల్లే. తన కూతురికి పాతికేళ్ళకు మొదటి పురుడొస్తే పోచమ్మ కూతురికిపుడు పదిహేడేళ్ళే – మరీ చిన్న వయసు . . . అందుకే ఆందోళన . . . పేగు బంధం లేకున్నా, ప్రేమ బంధం ఆమెను నిలువనీయటం లేదు.

కాలింగ్‌బెల్ మోగితే కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న రుక్మిణమ్మ పరుగు పెట్టినట్లే వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా పోచమ్మ మూడో కూతురు . . .

"అక్కకు ప్రసవం అయిందా? మగబిడ్డా? ఆడబిడ్డా?" ఆ అమ్మాయి చెప్పబోతున్న విషయం వినకుండానే ఆతృతగా అడిగింది.

"లేదమ్మా . . . దవాఖానకు తోలుకెళ్ళాలట . . . అమ్మ నీ తాన ఐదు నూర్లు బత్రమ్మంది".

ఆ మాట వినగానే రుక్మిణమ్మకు భయం వేసింది. మొదటి కాన్పు . . . పిల్లకెలా వుందో . . . లోపలికెళ్ళి కొంత డబ్బు తీసుకుని యింటికి తాళం వేసింది.

"తొందరగా పద . . . మీ యింటికెళ్దాం . . ." అన్నప్పుడు పోచమ్మ కూతురు అర్థం కానట్లు చూసింది.

"ఆటో మాట్లాడు . . . ఆలస్యం చేయటం అంత మంచిది కాదు" అందామె పరుగులాంటి నడకతో రోడ్డును సమీపిస్తూ.

పోచమ్మ యింటినిండా ఆడోళ్ళు గుమికూడి ఉన్నారు.

"బిడ్డ అడ్డం తిరిగిందని నర్సమ్మ సెప్తోంది. నీ మాట యిన్నా పోయేది. బిడ్డని ఆస్పిటల్ల షరీక్ సేయకపోతిని. గిప్పుడు దాని పానాలకె పెమాదమొచ్చె" అంటూ పోచమ్మ ఆమెను పట్టుకుని భోరుమంది.

రుక్మిణమ్మ దగ్గరుండి ఆస్పత్రిలో చేర్పించింది. ఆ అమ్మాయికి ఫోర్‌సెప్స్ డెలివరీ చేశారు డాక్టర్లు.

పోచమ్మ కూతురు తన పక్కన పడుకునున్న మగబిడ్డ వైపు మురిపెంగా చూసుకుంది. తనింతసేపూ పడిన నరకయాతన మర్చిపోయి తృప్తిగా నవ్వుకుంది. ఆ నవ్వు వెన్నెలంత చల్లగా ఉంది. రుక్మిణమ్మకు చేతులు జోడించి కృతజ్ఞత తెల్పుకున్నప్పుడామె కళ్లు వర్షించే మేఘాలైనాయి.

పోచమ్మ ఆమె కాళ్ళను చుట్టుకుని "నా బిడ్డకి పానం పోశావు తల్లీ . . . నీ మేలు జనమజనమలకీ మర్సిపోలేనమ్మా" అంది.

"నీ బాకీ నెల నెలా కొంత కట్టి తీర్చుకుంటానమ్మా. అవసరానికి దేవతలా వచ్చి ఆదుకున్నావు" వెళ్ళబోతున్న రుక్మిణమ్మతో అంది పోచమ్మ.

"అంతంత పెద్ద మాటలు దేనికి పోచమ్మా . . . నా కూతురైతే చేయనా? యిదీ నా యింట్లో పెరిగిన బిడ్డే. నువ్వు నాకేమీ బాకీ లేవు" అని రుక్మిణమ్మ అన్నప్పుడు పోచమ్మ కళ్ళలో కోటి చంద్రుల కాంతి.

ఆ గదినిండా వెన్నెల వెల్లువెత్తుతున్న అనుభూతి రుక్మిణమ్మకు.

యింటికి తిరిగొస్తున్నప్పుడు సమయం పదిన్నర . . . నగరంలోని నియాన్ లైట్ల కాంతిలో వెలవెల బోతున్న వెన్నెల 'నన్ను గమనించవేం' అన్నట్లు అలిగి ముడుచుకు పోయింది.

'ఆస్పత్రి గదిలో పోచమ్మా, దాని కూతురూ . . . వాళ్ళ కళ్ళలోంచి కురిసిన వెన్నెల ముందు నువ్వేపాటి' అనుకుంది రుక్మిణమ్మ.

ఆమె యింటికెళ్ళేసరికి సుభాష్‌చంద్ర టెర్రస్ మీద తన ప్రయోగశాలలో కూచుని - టెలిస్కోప్‌తో ఆకాశాన్ని పరిశీలిస్తున్నాడు.

"భోం చేశారా?" భర్త వస్తాడని తెల్సి కూడా ఆస్పత్రికి పరుగెత్తినందుకు కొద్దిగా సిగ్గుపడ్తూ అడిగింది.

అతను మరో లోకంలోంచి మాట్లాడ్తున్నట్టు "ఆ" అన్నాడు.

ఎక్కడికెళ్ళావని అడుగుతాడని ఎదురు చూసింది. అడక్కపోయేసరికి తనే చెప్పింది - 'మన వంట మనిషి పోచమ్మ లేదూ . . . దాని కూతురికి పురుడొస్తేనూ . . .'

అతను యిబ్బందిగా కదిలి - "ఈ పని మనుషులూ, వంట మనుషులూ, కూలి కర్షక జనాలూ . . . వాళ్ళ బాధలూ, కష్టాలు నాతో ఏకరువు పెట్టొద్దని చాలాసార్లు చెప్పా కదా . . . నన్నెందుకు డిస్టర్బ్ చేస్తావు?" అన్నాడు.

* * * * *

ఆకాశం బూజు పట్టినట్టు గజిబిజిగా ఉంది. నగర కాలుష్యానికి జంకి చంద్రుడెక్కడో దాక్కున్నట్టున్నాడు. నక్షత్రాలు మాత్రం బితుకు బితుకుమంటూ - మసక మసగ్గా మెరవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

సుభాష్‌చంద్ర టెర్రేస్ మీద తన ల్యాబ్‌లో కాకుండా, ఆరు బయట కూచుని టెలిస్కోప్‌తో నక్షత్రాల్ని పరిశీలిస్తున్నాడు. అతనికి కొద్ది దూరంలో కూచుని రుక్మిణమ్మ భర్తకు తాంబూలం చుట్టిస్తోంది.

ఆమెకు ఇక్కడి ఆకాశం ఎప్పుడూ నచ్చదు. నగరం కప్పుకున్న మసిగుడ్డలా కన్పించే ఈ ఆకాశానికీ, తన పల్లెటూరిని వెచ్చటి అమ్మ ప్రేమలా ఆవరించుకుని - లేత నీలం రంగులో అద్దంలా మెరిసే అక్కడి ఆకాశానికీ ఎంత తేడా! స్వచ్ఛమైన నీటి కొలను లాంటి ఆకాశంలో మేఘాలు తమ ప్రతిబింబాల్ని చూసుకుని మురిసిపోతుంటాయి.

రాత్రుళ్ళు నక్షత్రాలు దట్టమైన నల్లటి కురుల్లో పొదిగిన వజ్రాల్లా మెరుస్తుంటాయి. అందమైన అతివ తన జడలో తురుముకున్న మల్లెమొగ్గల్లా . . . అందమైన అనుభూతి. ఎన్నేళ్లయిందో అటువంటి అద్భుతమైన సౌందర్యాన్ని పొదువుకున్న ఆకాశాన్ని చూసి . . .

"ఏమిటీ ఆలోచిస్తున్నావు?" అడిగాడు సుభాష్‌చంద్ర.

"ఏవీ లేదు. నక్షత్రాల్ని చూస్తున్నా - రంగు వెలసిన రాళ్ళలా ఉన్నాయి"

"కవిత్వం చెప్తావు తప్ప అసలు నక్షత్రాలంటే ఏమిటో, ఎలా ఏర్పడతాయో ఎప్పుడైనా ఆలోచించావా? పదో తరగతి పాసు కాకున్నా మేనరికమని కదా చేసుకున్నాను. నువ్వు మొద్దువి కదా . . ." పెళ్ళయిన రోజు నుండీ దెప్పుతున్నట్లే ఎగతాళిగా అన్నాడతను.

"నా చిన్నప్పుడు మా పల్లెటూరి జనం చెప్పుకునేవాళ్ళు - చనిపోయిన వాళ్ళంతా ఆకాశంలో తారలై కన్పిస్తారని . . . మీరు నవ్వుతారు కానీ . . . నిజం"

అతను పెద్దగా నవ్వాడు.

"అదుగో - అటువైపు ఉంది చూశావూ - ఆ నక్షత్రం మీ నాన్న, ఇదుగో ఈ మూల మెరుస్తోన్నదేమో మా నాన్న" అంటూ మరోసారి నవ్వాడు.

"మేనమామ కూతుర్ని చేసుకున్నందుకు వచ్చిన తంటా ఇదంతా . . . నక్షత్రాలకు కూడా పుట్టుక, యవ్వనం, ముసలితనం, మరణం ఉంటాయని తెలుసా నీకు?"

రుక్మిణమ్మ కుతూహలంగా వింటోంది.

"కాస్మిక్ మేటర్ ఒక చోట కేంద్రీకరించబడి, అధిక పీడనానికి లోనై నక్షత్రం పుడుతుంది. వయసు పెరిగే కొద్దీ దాన్లోని ఇంధనం హైడ్రోజన్ తగ్గిపోవడం వల్ల అది వ్యాకోచిస్తుంది. దాన్ని 'రెడ్ జయంట్' అంటారు. అప్పుడు దాని నుంచి ఎర్రటి కాంతి వెలువడుతూ ఉంటుంది. అది ఇంకా ముసలిదైపోయాక, సంకోచించి, చిన్నగా మారుతుంది. దాన్ని 'వైట్ డ్వార్ఫ్' అంటారు. డ్వార్ఫ్ అంటే తెలుసు కదా - మరుగుజ్జు అని అర్థం. అప్పటికి దాని గురుత్వాకర్షణ శక్తి కొన్ని వందల వేల రెట్లు పెరుగుతుంది. చివరికీ శక్తి ఎంత బలంగా మారుతుందంటే దాన్నుంచి వెలువడే కాంతి కిరణాన్ని కూడా అది లాగేసుకుంటుంది. దాని నుంచి ఏ కాంతి వెలువడదు. కాబట్టి అక్కడ నల్లటి మచ్చలా కనిపిస్తుంది. దాన్నే 'బ్లాక్‌హోల్' అంటారు. అక్కడితో నక్షత్రం మరణించినట్లు లెక్క".

ఓసారి అతను తల తిప్పి రుక్మిణమ్మ వైపు చూసి – ఆమె శ్రద్ధగా వింటోందని అర్థం చేసుకుని మళ్ళా మాట్లాడడం కొనసాగించాడు.

"ప్రస్తుతం నేను చూస్తున్న గ్రహం పేరేమిటో తెలుసా . . . ప్లూటో . . . దీనికి చీకటి గ్రహమని పేరు . . . ఇది మంచులా గడ్డ కట్టిన మీథేన్‌తో నిండి ఉంటుంది. దీనికున్న ఒకే ఒక ఉపగ్రహం పేరు కేరోవ్ . . ."

ఆమె ధ్యాస రేపు భోజనాలకి వస్తున్న పిల్లల కోసం ఏమేం వంటకాలు చేయాలా అనే విషయం మీదికి మళ్లింది.

ప్రతి సంవత్సరం ఎండాకాలం సెలవలయిపోయి – స్కూళ్ళు తెరవటానికి ముందు– తమ దగ్గర పనిచేసే వాళ్ళ పిల్లలకు బట్టలు, యూనిఫాంలు, పుస్తకాలు కొనిచ్చి, పిల్లలందర్నీ పిలిచి భోజనాలు పెడుతుంది రుక్మిణమ్మ.

పోచమ్మ ఇద్దరు కొడుకులూ, డ్రైవర్ గౌస్ నలుగురు పిల్లల్లో చదువుకుంటున్న ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి, వాచ్‌మెన్ ఎలమంద మనవడూ . . . వీళ్ళ కోసం బట్టలూ, పుస్తకాలూ తెప్పించి పెట్టింది. రేపు ఆదివారం కాబట్టి పిల్లలందర్నీ మధ్యాహ్నం భోజనానికి పిలిచింది. పిల్లల కోసం గారెలు, పాయసం చేయమని పోచమ్మకు చెప్పింది. పులిహోర కూడా చేయిస్తేనో . . . పిల్లలు తృప్తిగా తింటే ఆమెకెంత సంతోషమో . . .

మరునాడు పిల్లలందర్నీ వరుసగా కూచోబెట్టి కొసరి కొసరి వడ్డించింది. పోచమ్మకు పాయసం చేయటం సరిగ్గా రాదని తనే పూనుకుని పాలూ, చక్కెర సరైన పాళ్ళలో కలిపి తయారు చేసింది.

పిల్లలు పాయసం జుర్రుకుంటూ తింటున్నప్పుడు వాళ్ల మొహాలు వెలిగిపోవటం చూస్తుంటే ఆమెకు తన పిల్లలు గుర్తొచ్చారు.

"అమ్మా . . . నువ్వు చేసే పాయసం అమృతంలా ఉంటుంది తెలుసా?"

ఈ పిల్లలు అదే భావాన్ని మాటల్లో వ్యక్తం చేయకుండా, వజ్రపు తునకల్లా మెరుస్తోన్న వాళ్ళ కళ్ళ ద్వారా చెప్తున్నారు.

భోజనాలు పూర్తయ్యాక, లైబ్రరీలో కాస్మాలజీకి సంబంధించిన పుస్తకాన్ని దీక్షగా చదువుతున్న తన భర్తను రుక్మిణమ్మ పిలిచింది.

"మీరూ రండి. ఎప్పుడూ గ్రహాలు, నక్షత్రాలూ, నెబ్యులాలు అంటారు తప్ప మిగతా

విషయాలు పట్టించుకోరేం. విశ్వాంతరాళంలో జీవజాలం ఉందేమోనని వెతకటం తప్ప భూగోళం మీదున్న మనుషుల్ని పట్టించుకోరా? పిల్లల కోసం తెప్పించిన బట్టలు, పుస్తకాలు మీ చేతుల మీదుగా ఇవ్వండి. వీళ్ళు మీ అంత గొప్పవాళ్ళు కావాలని దీవించండి".

"నన్ను ప్రశాంతంగా చదువుకోనివ్వవా? అటువంటి విషయాలన్నీ నువ్వే చూసుకో- నాకు తెలీవు" చదువుతోన్న పుస్తకంలోంచి తల ఎత్తకుండానే అన్నాడతను.

ఒక్కొక్కరిని పిలిచి బట్టలు, పుస్తకాలు ఇస్తున్నప్పుడు పిల్లల కళ్ళు నక్షత్రాల్లా మెరవటం ఆమె గమనించింది. నగరంలోని మసిబారిన ఆకాశంలో కాదు - తన పల్లెటూరిలోని అందమైన ఆకాశంలో కేరింతలు కొడుతూ మెరుస్తోన్న నక్షత్రాల్లా . . .

"మీరందరూ బాగా చదువుకుని అయ్యగారిలా గొప్ప వ్యక్తులు కావాలనీ - దేశానికి ఉపయోగపడాలనీ దీవిస్తున్నాను" అందామె మనస్ఫూర్తిగా.

అక్కడే నిలబడి వున్న గౌస్ "అయ్యగారంత గొప్ప వాళ్ళు అయినా కాకున్నా, మీ అంత గొప్ప మనసు - మంచితనం - మానవత్వం రావాలని దీవించండమ్మా" అన్నాడు.

* * * * *

ఆ రోజు సాయంత్రం వర్షం పడి వెలిసింది.

ఆకాశం నిర్మలంగా ఉంది.

రుక్మిణమ్మ మనస్సు మాత్రం వ్యాకులపడుతోంది. వర్షపు చినుకులు ఆకాశం కార్చిన అశ్రుధారల్లా కాకుండా, ఉదయం గౌస్ పెట్టుకున్న కన్నీళ్ళలా అన్పిస్తోందామెకు. శ్రామిక జనాల కష్టాలన్నీ ఆర్థికపరమైనవే. గౌస్‌కి నలుగురు పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు . . . పెద్దపిల్ల పెళ్ళీడుకొచ్చింది. తెల్సిన సంబంధమే ఖాయం చేశాడు. అబ్బాయి కూడా డ్రైవర్‌గా చేస్తున్నాడు. కట్నం పెద్దగా లేకున్నా పెళ్ళప్పుడు 'జహేజ్' కింద ఏవేవో సామాన్లు కొనివ్వాలట. ఎట్లా లేదన్నా పాతికవేల రూపాయల వరకు ఖర్చవుతుందనీ - ఎక్కడి నుంచి తేవాలో తెలియటం లేదనీ బావురుమన్నాడు గౌస్.

తనఖా పెట్టి డబ్బు తెచ్చుకోవడానికి సొంత ఇల్లు కూడా లేని అభాగ్యుడు . . . నగలమ్మి పెళ్ళి చేయటానికి పెళ్ళాం వంటి మీద నల్లపూసలు తప్ప కాసు బంగారం కూడా లేని దరిద్రుడు . . . తామిచ్చే నెల జీతంతో ఎలాగోలా సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. తన బలవంతం మీదే ముగ్గురు పిల్లల్ని బడిలో చేర్పించి చదివిస్తున్నాడు. మరి పిల్ల పెళ్ళి

కోసం పాతికవేల రూపాయలు ఎక్కడి నుంచి తేగలడు?

"మీరు తప్ప మాకెవరున్నారమ్మా . . . దాని నిఖా మీ చేతుల మీదుగా జరగాల. మీరు పూనుకోకపోతే దాని బతుకు బండలై పోతుందమ్మా" అంటూ గౌస్ ఆమె కాళ్ళ మీద పడ్డాడు.

నిజమే కదా . . . తను కాకపోతే అవసరంలో ఆదుకోవటానికి గౌస్‌కి మరెవరున్నారు?

తను సమాజం మొత్తాన్ని ఆదుకోలేకపోవచ్చు. అంత స్తోమతా, ఓపికా, సమయం తనకు లేవు. కానీ తమ మీద ఆధారపడి బతుకుతున్న ఈ మూడు నాలుగు కుటుంబాలు . . . తమనే నమ్ముకున్న ఈ కొద్దిమంది వ్యక్తులూ . . . వీళ్ళని అవసరంలో ఆదుకోకపోతే జీవితానికి సార్థకత లేదనిపించిందామెకు.

కానీ పాతిక వేల రూపాయలాయె . . . పెద్ద మొత్తం . . . అందులో పదివేల వరకు అతనెలాగోలా సర్దుకుంటానన్నాడు. మరో పదిహేను వేలు . . . ఎలా చేయాలా అని రోజంతా ఆమె మథన పడుతూనే ఉంది. కానీ చేయక తప్పదు. ఓ ఆడపిల్ల జీవితమాయె . . . గౌస్ కన్నీళ్ళు ఆమెను నిలవనీయటం లేదు.

రాత్రి భోజనాలప్పుడు కూడా ఆమె అన్యమనస్కంగానే ఉంది.

అమెరికాలో ఉన్న కొడుక్కి ఉత్తరం రాసి ఓ మూడొందల డాలర్లు గిఫ్ట్ చెక్కు పంపించమని అడిగితేనో . . . వాడికి మూడొందల డాలర్లు పెద్ద మొత్తం కాదు. కానీ అదే డబ్బు యిక్కడి రూపాయాల్లోకి మారితే . . . ఓ ఆడపిల్ల జీవితం . . . నిండు జీవితం . . .

కానీ ఆ ఆలోచన ఆమెకెందుకో నచ్చలేదు. ఆ సహాయమేదో తనే చేయాలి తప్ప దాని కోసం తన కొడుకుని అర్థించడం ఆమెకు మనస్కరించడం లేదు.

తనే చేయాలంటే ఎలా చేయాలో తెలీని పరిస్థితి.

సుభాష్ చంద్ర టెర్రేస్ మీదికి పోతూ ఆమెనూ రమ్మన్నాడు.

వెళ్ళి పక్కన కుర్చీలో కూచుంది.

"మన గెలాక్సీ పేరు తెలుసుగా – మిల్కీవే. ఇది స్పైరల్ గెలాక్సీ. మనకు సమీపంగా ఉన్న మరో గెలాక్సీ ఆండ్రోమిడా. అసలీ గెలాక్సీలన్నీ అమితమైన వేగంతో ఒక దాన్నుంచి మరొకటి దూరంగా వెళ్ళిపోతున్న విషయం తెలుసా నీకు?" అంటున్నాడతను. బిగ్ బ్యాంగ్ థియరీ గురించి ఏదో చెపుతున్నాడు.

ఆమె మనసు అతను చెప్పే ఖగోళ, విశ్వాంతరాళ రహస్యాల మీద లగ్నం కావటం లేదు.

'సూర్యుని చుట్టూ గ్రహాలు, గ్రహాల చుట్టూ చందమామలు నిర్ణీత కక్ష్యలో తిరగడానికి కారణం గురుత్వాకర్షణ శక్తి'.

సుభాష్ చంద్ర చాలాసార్లు చెప్పిన విషయం గుర్తొచ్చిందామెకు.

విశ్వంలోని అన్ని గ్రహాలు, నక్షత్ర సమూహాలు, పాలపుంతలు, నెబ్యులాలు . . . అన్నీ ఒకదానికొకటి అడ్డు రాకుండా ఓ నియమానికి, ఓ సూత్రానికి లోబడి సంచరిస్తున్నాయి.

గౌస్ కన్నీళ్ళకు కూడా ఓ సూత్రం ఉంది. మనిషిని మనిషితో కట్టి పడేసే అంత స్సూత్రం . . . ప్రేమ. గ్రహగతుల్ని గురుత్వాకర్షణ నియంత్రించినట్లే మానవ సంబంధాల్ని ప్రేమ బలంగా కట్టి ఉంచగలుగుతుంది. విశ్వమానవ ప్రేమ మాత్రమే అనంత మానవాళిని ఒక్కటిగా చేయగలుగుతుంది.

ఆమెకు అశాంతిగా అనిపించింది.

గౌస్ కూతురి నిఖా జరిగే వరకు ఆమె మనసు కుదుట పడేలా లేదు.

ఆమె కిందికి వెళ్ళడానికి లేచింది.

"నా సమయాన్ని వెచ్చించి నీకు విశ్వ రహస్యాల్ని తెలియ జెప్పాలని ప్రయత్నిస్తుంటే అలా వెళ్ళిపోతావేం . . . తెలుసుకోవాలని ఆసక్తిగా లేదా?" అన్నాడు సుభాష్ చంద్ర.

ఆమెకు హాస్పిటల్లోని పురిటి గదిలో పోచమ్మా, దాని కూతురి చూపుల్లోని వెన్నెల చల్లదనం, పిల్లలకు పుస్తకాలు పంచుతున్నప్పుడు నక్షత్రాల్లా మెరిసిన వాళ్ళ కళ్ళూ – సాయంత్రం కురిసిన వర్షపు చినుకుల్లా తన పాదాల్ని తడిపిన గౌస్ కన్నీళ్ళూ . . . గుర్తొచ్చాయి.

"నాకు తెలుసు. మీకే తెలియదు" అంటూ ఆమె మెట్లు దిగి కిందకు వెళ్ళిపోయింది.

**(ఆదివారం వార్త - 5 సెప్టెంబర్, 2004)**